andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.6 । కనిష్ఠం 24.8
నిర్మల్ జిల్లా వార్తలు
8
శనివారం 5 అక్టోబరు 2024



దివ్యాంగులకు అలింకో ఉపకరణాల అండ



ఖానాపూర్, అక్టోబరు 4 : పుట్టుకతోనే వైకల్యంతో కొందరు.. నిత్య జీవితంలో జరిగిన ప్రమాదాలతో అవయవాలను కోల్పోయిన వారు ఇంకొందరు... కారణం ఏదైనా కావొచ్చు కానీ వారి జీవితం దినమొక గండంలా గడుస్తుందనేది ఎవరు కాదనలేని సత్యం. తమకున్న వైకల్యానికి ఎవరిని నిందించాలో తెలియక నిరంతరం తమలో తామే మదన పడుతూ పరిస్థితులతో ఎప్పటికప్పుడు పోరాడుతూ జీవనాన్ని గడుపుతున్న వారు కొంతమంది ఉంటే... తమ వైకల్యాన్ని సొతం లెక్క చేయకుండా మొక్కవోని ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్తూ అన్ని అవయవాలు సరిగా ఉన్న ఎందరో మంది చేయలేని పనులను ఇట్టే చేస్తూ నేటి ఆధునిక సమాజానికి సైతం సవాలు విసిరే మరి కొంతమంది దివ్యాంగులను నేటి సమాజంలో మనం చూస్తూనే ఉన్నాం. దివ్యాంగులుగా ఉన్నవారు ఇతరులపై ఎక్కువగా ఆధారపడకుండా తమ పనులను తాము చేసుకునే విధంగా వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఓ పథకానికి రూపకల్పన చేసింది. ఈ పథకంలో భాగంగా దివ్యాంగులకు అలింకో ద్వారా ఉపకరణాలను, సహాయక పరికరాలను పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసింది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా మూడు రోజులపాటు దివ్యాంగుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన నేపథ్యంలో అర్హులైన దివ్యాంగులను ఎంపిక చేసి వారికి అవసరమైన ఉపకరణాలు, సహాయక పరికరాలను అందజేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.



దివ్యాంగుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న దృశ్యం

- దివ్యాంగులకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నద్ధం
- 40 నుంచి 100 శాతం వరకు వైకల్యం ఉన్నవారు అర్హులు
- జిల్లాలో ముగిసిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ
- ఎంపికైన వారికి రెండు నెలల్లో ఉపకరణాలు

ముగిసిన దరఖాస్తుల స్వీకరణ

దివ్యాంగులకు అండగా నిలిచేందుకు కేంద్రప్రభుత్వం నిర్వహిస్తున్న ఉపకరణాలు, సహాయక పరికరాల పంపిణీ కార్యక్రమానికి లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు జిల్లాలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ఈ నెల 10 నుండి 13 తేదీ వరకు నిర్వహించింది. ఈ నెల 10వ తేదీన ఖానాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఖానాపూర్, పెంబి, కడెం, దస్తురాబాద్, మామడ మండలాల పరిధిలోని దివ్యాంగుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ నెల 11వ తేదీన ముథోల్ నియోజక వర్గంలోని భైంసాలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. భైంసాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసులో నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో కుబీర్, ముథోల్, భైంసా, బాసర, లోకేశ్వరం, తానూర్, కుంటాల, నర్సాపూర్(జి) మండలాలకు చెందిన దివ్యాంగులు దరఖాస్తులు చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నెల 12వ తేదీన నిర్మల్‌లోని టీఎన్జీవో భవన్‌లో నిర్మల్ నియోజకవర్గం తాలూకా దివ్యాంగుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. నేపథ్యంలో సారంగాపూర్, నిర్మల్ రూరల్, లక్ష్మణచాంద, సోన్, నిర్మల్ అర్బన్, దిలావర్‌పూర్ మండలాలకు చెందిన దివ్యాంగులు దరఖాస్తులు చేసుకున్నారని చెబుతున్నారు.

అలింకో ద్వారా అందనున్న పరికరాలు

దివ్యాంగులకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం అలింకో సంస్థ ద్వారా నిర్వహిస్తున్న దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగిసిన రెండు నెలల లోపు దివ్యాంగులకు వారి అవసరాలకు తగిన ఉపకరణాలను, సహాయక పరికరాలను అందజేయనున్నట్లు చెబుతున్నారు. ఈ ప్రక్రియలో శారీరక దివ్యాంగులకు బ్యాటరీ ఆపరేటర్ ట్రై సైకిల్స్, మూడు చక్రాల రిక్షా, వీల్‌చైర్, సంక కర్రలు, చేతి కర్రలను వారి వారి వైకల్యాన్ని బట్టి అందజేయనున్నట్లు చెబుతున్నారు. బధిరులకు (మూగ, చెవిటి) శ్రవణ యంత్రాలు, అందులకు ప్రత్యేకమైన మొబైల్ ఫోన్లు, సెన్సార్‌తో కూడిన చేతి కర్రలు, మానసిక దివ్యాంగుల కిట్, మానసిక దివ్యాంగులకు వారి కోసం తయారు చేసిన ప్రత్యేక దివ్యాంగుల కిట్‌ను అందజేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇటీవల ఖానాపూర్, ముథోల్, నిర్మల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అన్ని మండలాల కోసం నిర్వహించిన దివ్యాంగుల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో పలువురు దివ్యాంగులు నిరాశతో వెనుదిరిగారు. యూడీఐడీ కార్డులు లేక కొంత మంది కార్డులు ఉన్నప్పటికీ అవి ఆన్‌లైన్‌లో ఓపెన్ కాక మరికొంత మంది నిరాశతో వెనుదిరిగారు. వైకల్యం ఉన్నప్పటికీ ఎటువంటి సర్టిఫికెట్లు లేక తమకు ఉపకరణాలు అందుతాయని ఆశిస్తూ వచ్చిన దివ్యాంగులు సైతం నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోలేక వెనుతిరగాల్సి వచ్చింది. జిల్లాలో మొత్తం 18 వేల సదరం సర్టిఫికెట్లు కలిగిన దివ్యాంగులు ఉండగా అందులో కేవలం 16,500ల మందికి మాత్రమే యూడీఐడీ కార్డులు ఉన్నట్లు చెబుతున్నారు. కార్డులు ఉన్నప్పటికీ కొంతమందికి ఆన్‌లైన్‌లో ఓపెన్ కావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటువంటి వారికోసం ఒక్కో ఐసీడీఎస్ ప్రాజెక్టులు పరిధిలో మరో రెండు రోజులపాటు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఒక్కో నియోజకవర్గంలో

రెండు రోజులపాటు నిర్వహిస్తే బాగుంటుంది

- గుగ్లావత్ కిషోర్‌నాయక్, 7వ వార్డు కౌన్సిలర్, ఖానాపూర్

దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేయడం మంచి ప్రక్రియ. కానీ యూడీఐడీ ఓపెన్ కాకపోవడంతో తదితర సమస్యలతో పలువురు దివ్యాంగులు నిరాశతో వెనుతిరుగుతున్నారు. జిల్లా అధికార యంత్రాంగం స్పందించి ఒక్కో నియోజకవర్గంలో రెండు రోజులపాటు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తే బాగుంటుంది.

ఎంపికైన వారికి

రెండు నెలలలోపు ఉపకరణాలను అందజేస్తాం

- రూపేష్ అలింకో పీఅండ్ఓ



దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన వెంటనే లబ్ధిదారుల ఎంపిక జరుగుతుంది. ఎంపికైన లబ్ధిదారులకు రెండు నెలల లోపు ఆర్టిఫిషియల్ లింబ్ మ్యాను ఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (అలింకో) ద్వారా వారి వారి అవసరాలను బట్టి ఉపకరణాలను అందజేస్తాం.

బ్రహ్మచారిణి రూపంలో బాసర అమ్మవారు



ఆలయంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు, బ్రహ్మచారిణి రూపంలోఅమ్మవారు

బాసర, అక్టోబర్, 4 : బాసర సరస్వతీ అమ్మవారి సన్నిధిలో జరుగుతున్న దసరా నవరాత్రి మహోత్సవాల రెండోరోజు శుక్రవారం బ్రహ్మచారిణి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం కావడంతో భక్తుల రద్దీ అధికంగా ఉంది. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర నుంచి భక్తులు హాజరయ్యారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. రెండు అక్షర శ్రీకార మండపాల్లో ఉత్సవాల దినాలు కావడంతో అధికసంఖ్యలో భక్తులు తమ పిల్లలకు అక్షర శ్రీకారపూజలు జరిపించారు.

ప్రముఖుల పూజలు

ఉత్సవాల సందర్భంగా శుక్రవారం పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు శంకర్, రేణికుంట్ల ప్రవీణ్, నీలదేవి, రాంబాబు నాయక్, కోకటి లక్ష్మీనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముదు కమిషన్, సభ్యులకు ఆలయ అధికారులు పూర్ణకుంభం స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఎం. రమేష్, సాంప్లీ రమేష్, రాందాస్, జే. రమేష్, తదితరులు ఉన్నారు.

దుర్గాదేవి ఆలయంలో నవరాత్రి ఉత్సవం



దుర్గాదేవి..భక్తులతో సందడిగా ఆలయం

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 4 : నిర్మల్‌లోని స్థానిక గండిరామన్న ప్రాంతంలోని దుర్గామాత ఆలయంలో దుర్గామాత నవరాత్రులు కొనసాగుతున్నాయి. శుక్రవారం సాయిదీక్షసేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

వశిష్ట డిగ్రీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



నిర్మల్ అర్బన్, అక్టోబరు 4 : జిల్లా కేంద్రంలోని వశిష్ట డిగ్రీ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విభిన్న రకాల పూలతో బతుకమ్మలను పేర్చారు. విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ తిరుగుతూ లయబద్ధంగా చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అఖిలేష్ కుమార్‌సింగ్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



కోనేరును పరిశీలిస్తున్న డీఆర్‌డీవో విజయలక్ష్మి

స్వచ్ఛత హీ సేవ ఆధ్వర్యంలో కోనేరు సుందరీకరణ

- డీఆర్‌డీవో విజయలక్ష్మి

ముథోల్, అక్టోబరు 4 : నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లోని ముక్తాదేవి ఆలయం ఎదురుగా ఉన్న కోనేరును స్వచ్ఛత హీసేవ కార్యక్రమంలో భాగంగా సుందరీకరణ చేయనున్నట్లు డీఆర్‌డీవో విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆలయం ఎదురుగా ఉన్న కోనేరును పరిశీలించి, పలు వివరాలను గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థులతో మాట్లాడి చర్చించారు. మరమ్మతులు చేయించినట్లయితే భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. దీంతో నీటి మట్టం భూమిలో పెరగడం వలన రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కోనేరు కొన్ని వందల సంవత్సరాల క్రితానికి చెందిందని రాజస్థాన్ గల కోనేరని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ కోనేరు ప్రాశస్త్యం కలిగిందని మరమ్మతులు చేయిస్తే ఉపయోగంలోకి వస్తుందని గ్రామస్థులు సూచించారు. సంబంధిత నివేదికను జిల్లా కలెక్టర్‌కు నివేదించనున్నట్లు డీఆర్‌డీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివకుమార్, ఏపీవో శిరీషరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌గౌడ్, మాజీ సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్, మున్నూరు కాపు సంఘం తాలూకా అధ్యక్షులు రోళ్ల రమేష్, వీడీసీ సభ్యులు నారాయణ, గ్రామస్తులు తాటివార్ రమేష్, ధర్మపురి సుదర్శన్, జీవన్ లవన్, తదితరులున్నారు.

పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దూరం



కుండీలలోని నిల్వ నీటిని పారబోస్తున్న మున్సిపల్, ఆరోగ్య సిబ్బంది

భైంసా, అక్టోబరు 4 : ప్రతి ఒకరు వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రతను పాటిస్తే వ్యాదులు దరి చేరవని భైంసా మున్సిపల్ కమీషనర్ రాజేష్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని పలు వార్డులలో జరిగిన డ్రై డే కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. పారిశుధ్య వ్యవస్థ మెరుగుదలకు, వ్యాధుల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని కుండీలు, కూలర్లు, టైర్లలోని నీటి నిల్వలను పారవేయించారు. ఇందులో మున్సిపల్ అధికారి గౌరీష్ కుమార్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ మహ్మద్ అనీస్‌తో పాటు ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతకు వృత్తి, నైపుణ్యాల్లో శిక్షణ అందించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 4 : జిల్లాలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పొందేలా వృత్తి, నైపుణాల్లో శిక్షణ అందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో శుక్రవారం వృత్తి, నైపుణ్య సొసైటీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆసక్తిగల యువతను గుర్తించి శిక్షణ పొందేలా ప్రోత్సహించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పలు పథకాలు యువత లబ్ధిపొందేలా వసతులు కల్పిస్తూ శిక్షణ అందిస్తున్నామని కలెక్టర్ వివరించారు. శిక్షణ తరువాత జాబ్ మేళాలను నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ఐటీఐ, డీజిల్ మెకానిక్, ఏసీ టెక్నీషన్, బ్యూటీషన్, మార్కెట్ తదితర రంగాల్లో శిక్షణ అందించాలని సూచించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, సీపీవో జీవరత్నం, డీఆర్డీవో విజయలక్ష్మి, డీటీడీవో అంబాజీ, ఉపాధి కల్పన అధికారి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ అభిలాష అభినవ్



డిజిటల్ కుటుంబ సర్వే పరిశీలిస్తున్న కలెక్టర్

డిజిటల్ కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 4 : డిజిటల్ కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పైలెట్ ప్రాజెక్టు క్రింద నిర్మల్ పట్టణం చింతకుంట వాడలో కొనసాగుతున్న సర్వే పరిశీలించారు. సర్వే సమయంలో ఏమైనా సమస్యలు ఎదురవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కుటుంబంలో పెద్ద వయసుగల మహిళ ఉంటే ఆమె పేరును ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. పైలెట్ ప్రాజెక్టు క్రింద ఎంపికైన గ్రామాలు, వార్డుల్లో ప్రతి కుటుంబాన్ని సర్వే చేయాలని ఆదేశించారు. కొత్త కుటుంబాల వివరాలు ఆధార్ కార్డు ద్వారా నమోదు చేసుకున్నామని కలెక్టర్‌కు సిబ్బంది వివరించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్న కళ్యాణి, మున్సిపల్ కమిషనర్ రాజు, మెప్మా పీడీ సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖ తీరును నిరసిస్తూ..

భైంసాలో హిందూ ధర్మ రక్షణ సమితి ఆందోళన

- ఏఎస్పీ కార్యాలయం ముట్టడి, బైఠాయింపు
- హత్యాయత్నం సెక్షన్ తొలగించాలంటూ ఏఎస్పీతో వాగ్వాదం
- ఏకపక్షంగా కేసులు నమోదు చేస్తున్నారంటూ ఏఎస్పీని నిలదీసిన సమితి ప్రతినిధులు
- నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నామని స్పష్టం చేసిన ఏఎస్పీ



ప్రధానరోడ్డు మార్గంలో ర్యాలీగా తరలివెలుతున్న హిందూ ధర్మ రక్షణ సమితి ప్రతినిధులు



ఏఎస్పీ అవినాష్ కుమార్‌తో వాగ్వాదానికి దిగిన మహిళలు

భైంసా, అక్టోబరు 4 : రెండు వేర్వేరు వర్గాలకు చెందిన యువతి, యువకుడి ప్రేమ వ్యవహారానికి సంబంధించి చోటు చేసుకున్న ఘటనపై నమోదు చేసిన కేసు విషయంలో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ.. హిందూ ధర్మ రక్షణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్మల్ జిల్లా భైంసాలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు ఏఎస్పీ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు హిందూ ధర్మ రక్షణ సమితి నాయకులు మాట్లాడుతూ.. పోలీసులు నమోదు చేసిన కేసులో తమ వర్గానికి చెందిన వ్యక్తులపై హత్యాయత్నం సెక్షన్‌ను ఎందుకు జోడించారని ప్రశ్నించారు. అంతేకాకుండా కేసులోని నిందితుల ఇళ్లల్లోకి పోలీసులు వెళ్లి కుటుంబసభ్యులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పోలీసు అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ తమ వర్గానికి చెందిన యువకులపైనే అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే హత్యాయత్నం సెక్షన్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. ఆ సమయంలో కార్యాలయంలోనే ఉన్న ఏఎస్పీ అవినాష్ కుమార్‌తో హిందూ ధర్మ రక్షణ సమితి శ్రేణులు, మహిళలు వాగ్వాదానికి దిగారు. స్పందించిన ఏఎస్పీ అవినాష్ కుమార్ ఆందోళనకారులను సముదాయించేందుకు ప్రయత్నించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా హత్యాయత్నం సెక్షన్ కింద కేసు నమోదు చేశామని ఏఎస్పీ తెలిపారు. ఘటన జరిగిన స్థలంలోని సీసీ కెమెరాల వీడియో ఫుటేజీని సేకరించి పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిన అనంతరం సెక్షన్ల మార్పు, చేర్పుల విషయంలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. నిందితుల ఇళ్లల్లోకి పోలీసులు వచ్చి భయభ్రాంతులకు గురి చేయకుండా చూస్తామన్నారు. కేసు విషయంలో పోలీసు అధికారులు నిష్పక్షపాత ధోరణితోనే వ్యవహరిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎవరూ.. ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దని కోరారు. ఏఎస్పీ అవినాష్ కుమార్ సమాధానాలతో సంతృప్తి చెందిన ఆందోళనకారులు శాంతించి.. అక్కడినుంచి వెళ్లిపోయారు. ఈ ఆందోళనలో భైంసా పట్టణ పరిధిలోని హిందూ కులాలకు సంబంధించిన ప్రతినిధులందరూ పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

మామడ, అక్టోబరు 4 : ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను, వరంగల్ రైతు డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని నిర్మల్ జిల్లా భారతీయ కిసాన్ సంఘ్ అధ్యక్షుడు ఓస రవి అన్నారు. శుక్రవారం రోజున ఆయన విలేకరులతో భారతీయ కిసాన్ సంఘ్ గౌరవ అధ్యక్షుడు నారాయణ రెడ్డితో కలిసి మాట్లాడారు. నేడు కామారెడ్డిలో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలకు పెద్దసంఖ్యలో పార్టీలకు అతీతంగా రైతులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఎటువంటి నిబంధనలు లేకుండా రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలన్నారు. రైతు భరోసా, పంటలకు బీమా పథకం, వన్యప్రాణుల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రతి రైతు సంఘటితమవుదామని, సమస్యలు పరిష్కరించుకుందామన్నారు. కామారెడ్డి రైతు మహాసభను విజయవంతం చేద్దామన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆంక్షల అమలు సరికాదు

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 4 : హిందువుల పండగల సందర్భంగా పోలీసుశాఖ 30 పోలీసు యాక్ట్ ఆంక్షలు అమలు చేయడం సరికాదని బీజేపీ నాయకుడు రాంనాథ్ అన్నారు. మున్సిపల్ శాఖ పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో పట్టణం మురికికూపంగా మారిందన్నారు. నవరాత్రుల సందర్భంగా మహిళలు ఇబ్బందులు పడతారని వారి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

రేపు టార్చ్ రిలే ర్యాలీ

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 4 : సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన స్పోర్ట్స్ అథారిటీ టార్చ్ రిలే ర్యాలీ ఆదివారం నిర్మల్ జిల్లాకు చేరనున్నట్లు క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు గంజాల్ టోల్‌ప్లాజా వద్ద ఆహ్వానం పలికి అక్కడి నుండి ఎన్టీఆర్ మినీస్టేడియం వరకు 10 కిలోమీటర్ల రన్ నిర్వహిస్తామన్నారు. క్రీడాకారులు, విద్యార్థులు, యూత్ పాల్గొనాలని కోరారు.

నేడు డీఈడీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు వెరిఫికేషన్లకు రావాలి

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 10 : డీఎడ్ ఫలితాల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు డీఎస్సీ 1:3లో పేరుంటే శనివారం వెరిఫికేషన్లకు హాజరుకావాలని డీఈవో రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. థామస్ స్కూల్‌లో తమ ఒరిజినల్స్, జిరాక్స్ కాపీల గెజిటెడ్ అటెస్ట్‌తో పరిశీలించుకోవాలన్నారు. గడువులోగా రాకుంటే పరిగణలోకి తీసుకోలేమన్నారు.

ఎన్ఎస్‌యూఐ కమిటీల రద్దు

భైంసా, అక్టోబరు 4 : యూనియన్ రాష్ట్ర బాధ్యులు మహ్మద్ పఠాన్, ప్రతీక్ సింగ్ ఆదేశాల మేరకు జిల్లాలోని ఎన్ఎస్‌యూఐ కమిటీలన్నింటిని రద్దు చేసినట్లుగా ఆ యూనియన్ జిల్లా మాజీ కార్య నిర్వాహక అధ్యక్షులు షేక్ అంజాద్ ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలోనే జిల్లాలోని మండలాలు, నియోజక వర్గాల వారీగా ఎన్ఎస్‌యూఐ కార్యవర్గాల నియమాకం జరుగుతుందని వెల్లడించారు. అర్హులైన ఉత్సాహవంతులకు , సమస్యలపై పోరాడే నాయకులకు నూతన కార్యవర్గ నియమాకాల్లో ప్రాధాన్యం ఉంటుందని వివరించారు.

పారిశుద్ధ్యంపై శ్రద్ధ వహించండి

తానూర్ , అక్టోబరు 4 : గ్రామాల్లో పారిశుద్ధ్యంపై శ్రద్ధ వహించాలని ఎంపీడీవో అబ్దుల్ సమ్మద్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఏల్వీ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీలో పలు రికార్డులను పరిశీలించారు. అంగన్‌కేంద్రాన్ని పరిశీలించి గ్రామంలో డ్రైడే సందర్భంగా పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. ప్రతి ఒక్కరు పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలన్నారు. ఈయన వెంట స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి నవీన్, గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నర్సాపూర్(జి), అక్టోబరు 4 : మండలంలోని రాంపూర్, నర్సాపూర్, కుస్లి, చాక్‌పల్లి, నందన్, గొల్లమాడ పలు గ్రామాల్లో శుక్రవారం ఫ్రైడే డ్రై డే నిర్వహించారు. ఎంపీవో తిరుపతిరెడ్డి మాట్లాడుతూ... ఇంటి పరిసర ప్రాంతాల్లో చెత్తా చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం గ్రామంలో ఫ్రైడే డ్రై డే నిర్వహించి ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కలిగిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో తిరుపతి రెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

తాంసి, అక్టోబరు 4: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని కరంజి(టి) గ్రామానికి చెందిన వ్యవసాయ సహకార సంఘం ఉద్యోగి గణేష్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. గణేష్ తాంసి నుంచి ఆదిలాబాద్ వెళుతుండగా ఖోడద్ మూలమలుపు వద్ద సడన్ బ్రేక్ వేయడంతో బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. తాంసి మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘంలో ఆయన స్టాఫ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు.



గాయపడ్డ గణేష్


సోయా పంట కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

మద్దతు ధర ఎప్పుడూ స్థిరంగా ఉండాలి

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ రూరల్, అక్టోబరు 4: రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర దొరకాలని, అలాగే ధర స్థిరంగా ఎప్పుడూ ఉండేలా చూడాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ద్వారా సోయా కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, అదనపు కలెక్టర్ శ్యామల దేవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పత్తి పంటను సీసీఐ ద్వారా సోయా పంటను రాష్ట్ర ప్రభుత్వం నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేయాలని కోరారు. సంవత్సరం కాలం పాటు పండించిన పంటలకు కనీస మద్దతు ధర ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. మార్కెట్ యార్డుకి రైతులు ఎప్పుడు వచ్చినా అవగాహన కల్పించి చిన్నచిన్న విషయాలకు ఇబ్బందులు కలిగించకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు దయాకర్, ఆకుల ప్రవీణ్, అశోక్‌రెడ్డి, జోగు రవి, గొర్ల రాము, సోమ రవి రాజేష్, ముకుందరావు, పెద్దసంఖ్యలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

● వార్ధ జిల్లా ఇన్‌చార్జిగా బీజేపీ ఎమ్మెల్యే

ఆదిలాబాద్ రూరల్: త్వరలో మహారాష్ట్రలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా వార్ధ జిల్లా ఇన్‌చార్జిగా ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను ఆ పార్టీ కేంద్ర అదిష్టానం నియమించింది. ఇందులో భాగంగా శుక్రవారం వార్ధ జిల్లాలోని బూత్‌స్థాయి కార్యకర్తలతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. మరోసారి మహారాష్ట్రలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడేలా కార్యకర్తలు సమిష్టిగా పని చేయాలని దిశా నిర్దేశం చేశారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభంలో పోటాపోటీ

● బోథ్ మార్కెట్ యార్డులో సోయాబీన్ కొనుగోళ్లను మొదట ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్, ఆ తర్వాత ఎమ్మెల్యే అనిల్

బోథ్, అక్టోబరు 4: బోథ్ మార్కెట్ యార్డులో సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి శుక్రవారం మొదట ప్రారంభించారు. అయితే 11 గంటల ప్రాంతంలో బోథ్ మార్కెట్ కమిటీలో ఎమ్మెల్యే అనిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వెంట జిల్లా అధికారులు జాయింట్ కలెక్టర్, మార్క్‌ఫెడ్ అధికారి డీసీవోలు పాల్గొన్నారు. కాగా, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంట పాల్గొన్న బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో రైతాంగానికి తమ ప్రభుత్వం మరింత చేయూత నిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ కదం ప్రశాంత్‌తో పాటు వ్యవసాయ కమిటీ సహకార సంఘం డైరెక్టర్లు పాల్గొన్నారు. అనంతరం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన స్థానిక ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ రైతులు దళారులకు అమ్మి మోసపోవద్దని కోరారు. అయితే మార్కెట్ యార్డుకు వచ్చే రైతులకు అధికారులు భోజనం, నీటి వసతి కల్పించాలని సూచించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు ఒకే కేంద్రాన్ని ప్రారంభించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారిందంటున్నారు.

● 'ప్రొటోకాల్ ఉల్లంఘనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం'

బోథ్: బోథ్ మార్కెట్ కమిటీ ఆవరణలో సోయాబీన్ కొనుగోలు


సోయాబీన్ కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్

విషయంలో ప్రొటోకాల్ ఉల్లంగించారంటూ జిల్లా జాయింట్ కలెక్టర్, మార్క్‌ఫెడ్ డీఎం, డీసీవోలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సోయాబీన్ పంట కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం మార్కెట్ యార్డులో ప్రారంభించిన అనంతరం జిల్లా అధికారులు బోథ్ ఎమ్మెల్యే ద్వారా కొనుగోలు ప్రారంభించడం సరైన పద్ధతి కాదన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో కొనుగోలు ప్రారంభించిన జిల్లా అధికారులు తమకు కనీస సమాచారం ఇవ్వలేదంటూ ఆయన విమర్శించారు.


లక్కారం రాంజీగోండు నగర్‌లో దుర్గామాత పూజల్లో పాల్గొన్న భక్తులు

అంగరంగవైభవంగా దుర్గాదేవికి పూజలు

ఉట్నూర్, అక్టోబరు 4: ఆదిలాబాద్ జిల్లాలో దుర్గాదేవి శరన్నవరాత్రులు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉట్నూర్‌లో శుక్రవారం దుర్గాదేవి ప్రతిష్ఠాపన జరిగి రెండోరోజు అవుతున్నందున దేవిమాతను గాయత్రి దేవిగా భక్తులు అలంకరించారు. మండలం లక్కారం, నవోదయనగర్, పాత ఉట్నూర్, శ్యామ్పూర్, నర్సపూర్, పులిమడుగు, ఉమ్రి, ఎందా, ఉట్నూర్‌లలో దేవి విగ్రహాలను ప్రతిష్ఠించి ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు.

ఇచ్చోడ: ఇచ్చోడ పట్టణంలో దసరా పండగను పురస్కరించుకుని దేవీ నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. పట్టణంలోని మార్కెట్‌గల్లీ, విద్యానగర్, విఠలేశ్వర్ ఆలయం, సుభాష్‌నగర్, అశోక్‌నగర్, టీచర్స్‌కాలనీలతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించి, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేరడిగొండ: దుర్గాదేవికి శుక్రవారం శ్రీగాయత్రీదేవి అవతారంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని కుమారి, బుగ్గారాం, రాజూరా, బోరిగాం, వాగ్దారి, తదితర గ్రామాలలో పూజలు చేశారు.

'ఆలయాలతో సుఖశాంతులు'

నేరడిగొండ, అక్టోబరు 4: ప్రతీ గ్రామంలో ఆలయాలు ఉంటే.. ఆ గ్రామాల్లో సుఖశాంతులు నెలకొంటాయని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కుంటాల, చిన్న బుగ్గారాం గ్రామాలకు ఆలయాల నిర్మాణానికి రూ.55 లక్షల నిధులు మంజూరు కాగా.. ఆయన భూమిపూజ చేసి పనును ప్రారంభించారు. రెండు గ్రామాల్లో ఎర్పాటు చేసిన భోగ్ భండాం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గంలో విద్యా, వైద్యం, రవాణా అందించేందుకు ఎల్లవేళలా కృషి చేస్తానని అన్నారు. గ్రామాలలో సందర్శించి గ్రామస్థులతో కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు ఆయన వెంట నేరడిగొండ మాజీ ఎంపీపీలు రాథోడ్ సజన్, నాయకులు దేవేందర్ రెడ్డి, చందర్‌సింగ్, విలాస్‌రావు, ప్రతాప్‌సింగ్, ఆడే వసంత్‌రావు, అంబాజీ, ప్రకాష్, బాబులాల్, తదితరులు ఉన్నారు.

కళాశాలలో బతుకమ్మ సంబరాలు

ఇంద్రవెల్లి, అక్టోబరు 4: మండలంలోని లీమ్‌గూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ మారుతి ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులు, అధ్యాపకులు ముందస్తుగా బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి పాఠశాల ఆవరణలో సంప్రదాయ నృత్యాలు చేశారు. అనంతరం కళాశాలలో శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో విద్యార్థినులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మారుతి, అధ్యాపకులు ప్రమీళ, సరిత, వెంకటేష్, శివరాజ్, విద్యార్థినీ విద్యార్థులు ఉన్నారు.

ప్రతీ బూత్‌లో సభ్యత్వ నమోదు : ఎంపీ

ఇంద్రవెల్లి, అక్టోబరు 4: ప్రతీ బూత్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు జరగాలని ఎంపీ గోడం నగేష్ పిలుపునిచ్చారు. ఈ దిశగా ప్రతీ కార్యకర్త అంకిత భావంతో పని చేయాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం మండలంలోని ధన్నోర(బి) గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు అరెల్లి రాజలింగు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములనుచేసి బూత్ స్థాయిలో 75 శాతానికి తగ్గకుండా సభ్యత్వ నమోదు జరిగితేనే పార్టీ బలపడి స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని సీట్లను కైవసం చేసుకుంటుందని వివరించారు. బాగా పని చేసిన కార్యకర్తలను పార్టీ గుర్తించి, వారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తుందని చెప్పారు. బూత్ అధ్యక్షుడు కావాలన్న ఆ బూత్‌లో ఎక్కువ మందితో సభ్యత్వం చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర యువ నేత రాథోడ్ రితేష్, మాజీ సహకార చైర్మన్ మోరే దిలిప్, బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు మరప రాజు, మాజీ ఎంపీటీసీ పడ్వాల్ విజయ్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు ప్రత్యేక కౌంటర్

తాంసి, అక్టోబరు 4: పట్టభద్రులు, ఉపాధ్యాయ మండలి ఎన్నికలకు సంబంధించిన ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైనట్లు తాంసి తహసీల్దార్ లక్ష్మీ తెలిపారు. దీని కోసం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను సైతం ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఓటరుగా నమోదు కోసం పట్టభద్రులు ఫారం-18, టీచర్ల ఫారం-19 ద్వారా దరఖాస్తులను కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

భీంపూర్: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో భీంపూర్ తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్సీ ఓటరు నమోదు కౌంటర్ ఏర్పాటు చేశారు. సంబంధిత దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. తహసీల్దార్ నలంద ప్రియ, డీటీ హరిదాస్, జూనియర్ అసిస్టెంట్ ప్రేమ్ తదితరులు ఉన్నారు.

'పద్మశాలీ సంఘం జిల్లా కార్యవర్గం రద్దు'

ఆదిలాబాద్ అర్బన్, అక్టోబరు 4: పద్మశాలీ సంక్షేమ సంఘం జిల్లా కార్యవరాన్ని రద్దు చేస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యవర్గం పదవి కాలం ముగిసిన నేపథ్యంలో త్వరలో ఎన్నికలను నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.పదవి కాలంలో సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో సంఘం సభ్యులు దత్తు, నరేష్, మోహన్, అడెల్లు, వెంకన్న, గణేష్, సంతోష్, హనుమండ్లు తదితరులున్నారు.

విద్యార్థినుల తల్లిదండ్రులకు అవగాహన

ఉట్నూర్, అక్టోబరు 4: మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్‌లో ఉన్న తెలంగాణ గిరిజన మహిళ డిగ్రీ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థినిల తల్లిదండ్రులకు అధ్యాపకులు అవగాహన కల్పిస్తున్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఆదేశాల మేరకు కళాశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు గురుకు విద్య, విద్యేతర కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. మండలంలోని లింగోజి తండా గ్రామంలో ఇంగ్లీష్ అధ్యాపకురాలు బుర్ర మానస విద్యార్థుల ఇంటి వద్దకి వెళ్లి వారి కుటుంబ, ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకోవడంతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులకు గురుకుల కళాశాల గురించి,గురుకులాల్లో నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల గురించి వివరించారు. ఇంపాక్ట్ మీటింగ్,ఇగ్నైట్ ఫెస్ట్, క్లైమ్బింగ్, భోజనం, ఆటలు, భారత్‌దర్శన్ తదితర అంశాల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం జరిగిందని మానస తెలిపారు. అదే విధంగా పండుగ సెలవుల అనంతరం తల్లిదండ్రులకు కళాశాల పున: ప్రారంభం రోజున తమ విద్యార్థులను కళాశాలకు పంపించాలని కోరారు.

రాష్ట్రంలో రెండు కొత్త ట్రిపుల్ ఐటీలు

● ఖమ్మం.. మహబూబ్‌నగర్ జిల్లాలో ఏర్పాటు ● రాష్ట్ర ప్రభుత్వ యోచన
● వచ్చే ఏడాది కల్లా ప్రారంభించేలా ప్రణాళిక ● మెనిఫెస్టోలో ఇచ్చిన హామీకి అనుగుణంగా నిర్ణయం

బాసర, అక్టోబర్, 4 : రాష్ట్రంలో బాసర ట్రిపుల్‌ఐటీ తరహాలో మరో రెండు కొత్త ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లు ఏర్పాటు కానున్నాయి. ఈ విషయమై మంత్రివర్గంలో చర్చించారు. మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఏర్పాటైన ఈ విద్యాసంస్థలు విద్యాపరంగా మంచి ఫలితాలు సాధిస్తున్నాయి. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో కూడా కొత్త ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఉమ్మడి రాష్ట్రంలో మూడు ట్రిపుల్ ఐటీలు ఏర్పాటయ్యాయి. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణకు బాసర క్యాంపస్ ఒక్కటే మిగిలింది. ఏపీలో మాత్రం నూజివీడు, ఇడుపులపాయ ఉండగా 2015 లో అప్పటి సీఎం చంద్రబాబు మరో రెండు కొత్త క్యాంపస్‌లు ఏర్పాటు చేశారు. అక్కడ మొత్తం నాలుగు ట్రిపుల్ ఐటీలో ఏడాదికి నాలుగువేల మంది విద్యార్థులకు కొత్తగా ప్రవేశం కల్పిస్తున్నారు. ఇక్కడ ఒక్క క్యాంపస్ ఉండడంతో కేవలం 1500 మంది విద్యార్థులకే అడ్మిషన్లు ఉన్నాయి.

ఖమ్మంలో ఒకటి.. మహబూబ్‌నగర్ మరొకటి

కొత్తగా ఏర్పాటు చేసే క్యాంపస్‌లను దక్షిణంలో మహబూబ్‌నగర్‌లో, తూర్పున ఖమ్మంలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ మేరకు ఆయా జిల్లాల అగ్రనేతలు పట్టుబడుతుండడంతో క్యాంపస్ ఏర్పాటు తథ్యం అనే ఆశాభావం ప్రభుత్వ వర్గాల్లో వ్యక్తం అవుతుంది. కేసీఆర్ ప్రభుత్వ హయంలో కూడా ప్రణాళిక సంఘం చైర్మన్ గా పనిచేసిన నిరంజన్‌రెడ్డి నియోజకవర్గం వనపర్తిలో ఏర్పాటు చేయాలని భావించారు. బాసర క్యాంపస్‌ను సందర్శించి వివరాలు సేకరించారు. వనపర్తిలో స్థల సేకరణ లాంటివి జరిగినా చివరి నిమిషంలో పెండింగ్‌లో పడింది. ఈ సారి మాత్రం కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టోలో పెట్టింది కావున ఏర్పాటు చేసే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.


ఆర్జీయూకేటీ క్యాంపస్‌లో విద్యార్థులు

వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభించేలా ప్రణాళిక

ఒక్కో క్యాంపస్ కనీసం వంద ఎకరాలు తగ్గకుండా భూమి అవసరం. పూర్తి స్థాయిలో మౌళిక వసతుల కోసం రూ. 400 కోట్లు వరకు ఒక్కో దానికి నిధులు కావాలని ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వచ్చే విద్యాసంవత్సరానికి ప్రారంభించాలంటే మొదటి దశలో రూ. 100 కోట్ల చొప్పున అవసరం ఉంటుందనే అంచనాలకు వచ్చారు. ప్రభుత్వం అనుకుంటున్నట్లు పూర్తి అయితే కొత్త క్యాంపస్‌లు ఏర్పాటై ఒక్కో క్యాంపస్‌లో వెయ్యి మందికి విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారు.

పాత తర్లపాడ్ - నాగపూర్ రోడ్డుకు

అడ్డంగా తవ్విన కందకాన్ని పూడ్చేయాలి

● పాత తర్లపాడ్ గ్రామస్థుల డిమాండ్


రోడ్డుకు అడ్డంగా అటవీ శాఖ అధికారులు తవ్విన కందకాన్ని చూపుతున్న గ్రామస్థులు

ఖానాపూర్, అక్టోబరు 4 : మండలంలోని పాత తర్లపాడ్ - నాగపూర్ గ్రామాల మధ్య గల రోడ్డుపై అటవీశాఖ అధికారులు తవ్వించిన కందకాన్ని వెంటనే పూడ్చేయాలని పాత తర్లపాడ్ గ్రామస్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం కందకం తవ్విన ప్రాంతాన్ని గ్రామస్థులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 2001లోనే తమ గ్రామం నుంచి నాగపూర్ మీదుగా పెంబి వెళ్లేందుకు ప్రభుత్వం రోడ్డును మంజూరు చేసిందన్నారు. ఈ రోడ్డుపై ఐదు చోట్ల కల్వర్టుల నిర్మాణం సైతం చేశారన్నారు. అప్పట్లో ఈ రోడ్డు గుండా ఖానాపూర్ నుంచి పాత తర్లపాడ్ మీదుగా పెంబి బస్సు నడిచేదన్నారు. కొన్ని కారణాల వల్ల ఆ బస్సు రద్దు అయిన తర్వాత ఈ రోడ్డు మీదుగా ప్రైవేట్ వాహనాలలో పెంబి వెళ్లేందుకు తమ గ్రామస్తులకు ఉపయోగపడుతుందన్నారు. ఇదివరకే ఉపయోగంలో ఉన్న రోడ్డుపై అటవీ శాఖ అధికారులు కందకాలను తవ్వించడం ఎంతవరకు సమంజసమన్నారు. వెంటనే తవ్వించిన కందకాలను పూడ్చేసి తిరిగి రోడ్డును ఉపయోగంలోకి తేవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామస్తులంతా కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. తిరిగి తమ గ్రామం మీదుగా పెంబి బస్సును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పడిగెల శేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మక్కల భీమన్న, మాజీ ఉప సర్పంచ్ బొంత చిన్న బాపు, బోదాసు సాయి, రఘుపతి రెడ్డి, పెద్దులు, రాకేష్ రెడ్డి, ఇటిక్యాల రవి, గంగారెడ్డి, శంకర్, గణేష్, సాయన్న, తదితరులున్నారు.

సమత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఓటరు నమోదు

నర్సాపూర్(జి), అక్టోబరు 4 : మండలంలోని అర్లి(కే) గ్రామంలో సమత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత ఓటరు నమోదు కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలు ఉచిత ఓటు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని, 18 సంవత్సరాలు నిండిన వాళ్ల కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సమత ఫౌండేషన్ సీఈవో అనిల్, కళ్యాణ్, ప్రవీణ్, శ్రీకాంత్, సిందే మారుతి, జాదవ్ మారుతి రావు, పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

అన్నదాతల అభివృద్ధికి అంకితభావంతో పాటుపడాలి

● ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్



ఆలయ కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్

భైంసా, అక్టోబరు 4 : బాధ్యతాయుతమైన విధానాల ద్వారా వ్యవసాయ శాఖాధికారులందరూ అన్నదాతల అభివృద్ధికి అంకితభావంతో పాటుపడాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ సూచించారు. శుక్రవారం భైంసాలో జిల్లా వ్యవసాయాధికారి అంజీప్రసాద్ నేతృత్వంలో నియోజక వర్గ పరిధిలోని వ్యవసాయాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. అర్హులైన ప్రతి రైతుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలన్నారు. భైంసా ఏడీఏ వీణ, నియోజక వర్గ పరిధిలోని ఆయా మండలాల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

డివిజన్ పరిధిలోని భైంసా, కుబీర్ కేంద్రాలలో శనివారం నుంచి ప్రారంభించే సోయా కొనుగోలు కేంద్రాలను రైతాంగం సద్వినియోగపరుచుకోవాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ సూచించారు. శుక్రవారం స్థానికంగా విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రైవేట్ మార్కెట్‌లో కన్నా కనీస మద్దతు ధర ప్రాథమిక సహకార కేంద్రాల ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లుగా వివరించారు. పట్టణంలోని బాగుబాయి గుట్ట సాయిబాబా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపాన్ని ప్రారంభించి మాట్లాడారు. గోశాల ఏర్పాటుకు స్వంతంగా రూ.2 లక్షలు విరాళంగా అందివ్వనున్నట్లుగా వెల్లడించారు. భైంసా మున్సిపల్ మాజీ చైర్మెన్ బి. గంగాధర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ రాజేష్‌బాబు, సాయినాథ్ గుజ్జల్‌వార్, ప్రకాష్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

andhrajyothy.com శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.8, కనిష్ఠం 24.2



ఆదిలాబాద్ జిల్లా వార్తలు

5

శనివారం 5 అక్టోబరు 2024


'ఏజెన్సీలో బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలి'

ఆదిలాబాద్ రూరల్, అక్టోబరు 4: ఏజెన్సీ కోటా ప్రకటించిన తర్వాతనే డీఎస్సీలో నియామకాలు జరపాలన్న న్యాయస్థానం తీర్పును లెక్క చేయకుండా ప్రభుత్వం నియామకాల కోసం ధ్రువపత్రాల పరిశీలన జరపడం ఎంతమేరకు సమంజసమని ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సోమేష్ ప్రశ్నించారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా శుక్రవారం ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయంలో ఎదుట ధర్నా నిర్వహించారు. ఏజెన్సీలో బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో.. భ్రూణహత్యలు



- జిల్లాలో ఆడ పుట్టుకను అంతమొందిస్తున్నారు!
- విచ్చలవిడిగా లింగ నిర్ధారణ పరీక్షలు
- స్కానింగ్ సెంటర్ నిర్వాహకుల ఇష్టారాజ్యం
- గుట్టుచప్పుడుకాకుండా ప్రైవేట్ ఆసుపత్రుల్లో దందా
- భ్రూణహత్యల నివారణ చట్టం ప్రకారం పాల్పడినా.. ప్రోత్సహించిన చట్టరీత్యా శిక్షార్హులు
- అయినా.. నిత్యం ఎక్కడో ఓచోట గుట్టుచప్పుడు కాకుండా దారుణాలు
- పత్తాలేని అధికారిక కమిటీలు.. కరువైన అవగాహన
- జిల్లావ్యాప్తంగా 2011 జనాభా లెక్కల ప్రకారం వెయ్యి మంది పురుషులకు గాను 934 మంది స్త్రీలు



ఆదిలాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తల్లి కడుపులో ఆడపుట్టుక ప్రాణం పోసుకుంటోందని తెలిస్తే చాలు.. గర్భంలోనే పిండాన్ని పిండేస్తున్నారు. ఆడపిల్లల పట్ల సమాజంలో ఇంకా అదోరకమైన భావన ఉండడంతో.. యేటా భ్రూణహత్యల దారుణాలు పెరిగిపోతూనే ఉన్నాయి. జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం వెయ్యి మంది పురుషులకు గాను 934 మంది స్త్రీలు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. 1994 భ్రూణహత్యల నివారణ చట్టం ప్రకారం భ్రూణహత్యలకు పాల్పడినా.. ప్రోత్సహించిన చట్టరీత్యా శిక్షార్హులు. కానీ నిత్యం జిల్లాలో ఎక్కడో ఓ చోట గుట్టుచప్పుడు కాకుండా భ్రూణహత్యల దారుణాలు జరిగిపోతున్నా.. వైద్య ఆరోగ్య శాఖకు పట్టింపే లేకుండా పోయిందన్న ఆరోపణలు వస్తున్నాయి. ప్రైవేట్ ఆసుపత్రుల్లో జరుగుతున్న ఆపరేషన్లు, స్కానింగ్ పరీక్షలపై ప్రైవేట్ సిబ్బంది చెప్పిందే లెక్కాగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లోనూ గుట్టుచప్పుడుకాకుండా కొందరు ఆర్ఎంపీ వైద్యులు భ్రూణహత్యలకు పాల్పడుతున్నట్లు తెలుస్తుంది. గతంలో భ్రూణహత్యలకు పాల్పడిన సమయంలో వైద్యం వికటించి ప్రాణాల మీదికి తెచ్చుకున్న పరిస్థితులు ఉన్నాయి. ఒకరిద్దరు వైద్యులపై కేసులు నమోదు కావడంతో జైలు పాలైన దాఖలాలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా.. వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైనట్లు కనిపించడం లేదు. ఏదో సంఘటన జరిగినప్పుడే హడావుడి చేస్తున్న అధికారులు.. ఆ తర్వాత తేలికగా తీసుకోవడంతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఇష్టారాజ్యంగా లింగా నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నట్లు తెలుస్తుంది. జిల్లాలో కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు ఇదే పనిగా పెట్టుకుంటున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. అయినా వైద్య ఆరోగ్య శాఖ తనిఖీలు నిర్వహించక పోవడంతో కొందరు వైద్యుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోయిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

విచ్చలవిడిగా స్కానింగ్‌లు

గర్భిణులకు ఏదైనా ప్రాణపాయం ఉందన్న సమయంలోనే లింగ నిర్ధారణ పరీక్షలు చేయాల్సి ఉంటుంది. కానీ కొందరు వైద్యులు చిన్నపాటి సమస్యలకు కూడా స్కానింగ్ పరీక్షలు చేస్తూ.. అందినకాడికి దండుకుంటున్నారు. దీంతో గర్భంలో పెరిగే శిశువు ఆడ? మగ? అని అప్పుడే తెలిసిపోవడంతో భ్రూణహత్యలకు పాల్పడుతున్నారు. ఒక్కో స్కానింగ్ పరీక్షలకు నిర్వాహకులు రూ.2వేల నుంచి రూ.3వేల వరకు దండుకుంటున్నారు. అత్యవసర సమయంలో అధికంగానే వసూలు చేస్తున్నారు. జిల్లాకేంద్రంలోని కొన్ని స్కానింగ్ సెంటర్లు ఎలాంటి అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నా.. చర్యలు తీసుకునేందుకు వైద్య ఆరోగ్య శాఖాధికారులు వెనుకడుగు వేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు సీనియర్ వైద్యులు భ్రూణహత్యలు చేయడమే పనిగా పెట్టుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. కేవలం నిబంధనలకు విరుద్ధంగా లింగా నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు మాత్రమే చేస్తూ వదిలేయడంతో స్కానింగ్ సెంటర్ నిర్వాహకుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి.



అడ్డగోలుగా వసూళ్లు

బాధితుల అవసరం, ఆరోగ్య పరిస్థితులను బట్టి కొందరు వైద్యులు అడ్డగోలు గా వసూళ్ల దందాకు ఎగబడుతున్నారు. అవసరమైతే భ్రూణహత్యలకు వెనుకాడడం లేదని తెలుస్తుంది. ముఖ్యంగా జిల్లాకేంద్రంలోని టీఎస్టీవోస్ రోడ్డులో ఉన్న ఓ ఆసుపత్రితో పాటు రైల్వే గేటు సమీపంలో ఉన్న పలు ఆసుపత్రుల్లో గుట్టుచప్పుడుకాకుండా దందా సాగుతున్నట్లు తెలుస్తుంది. కొన్ని మండల కేంద్రాల్లోను సీనియర్ ఆర్ఎంపీ వైద్యులు భ్రూణహత్యల్లో ఆరితేరినట్లు చెబుతున్నారు. ఇటీవల పట్టణ సమీపంలోని మురికినీటి కాల్వల్లో పిండాన్ని పోలిన రక్తపు ముద్దలు వెలుగు చూడడం చర్చనీయాంశంగా మారింది. అమాయకుల అవసరాన్ని బట్టి అబార్షన్ ధరలను నిర్ణయిస్తున్నట్లు సమాచారం. ఒక్కో అబార్షన్‌కు రూ.15వేల నుంచి రూ.30వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. అలాగే గర్భంలోని పిండం వయస్సును బట్టి మరీ రేటును నిర్ణయిస్తున్నట్లు సమాచారం. బాధితులను భయభ్రాంతులకు గురి చేస్తున్న వైద్యులు.. అందినకాడికి దండుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో వైద్యం వికటించి తల్లి ప్రాణానికే ముప్పు వాటిల్లుతోంది. అయినా ఇలాంటి విషయాలను బయటకు పొక్కకుండా వైద్యులు జాగ్రత్త పడుతున్నారు. ఏదైనా విషయం బయటకి వచ్చినా.. మధ్యవర్తుల సహాయంతో సెటిల్ చేసుకుంటున్నారు.

కొరవడుతున్న పర్యవేక్షణ

గుట్టుచప్పుడు కాకుండా కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో భ్రూణహత్యల దారుణాలు జరుగుతున్నా.. వైద్య ఆరోగ్యశాఖ అధికారుల పర్యవేక్షణ కనిపించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. తల్లిదండ్రుల్లోనూ అవగాహన లేకపోవడంతో భ్రూణహత్యలతో ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. ఆడ శిశువు అని తేలిపోగానే అంతమొందించేందుకు ఆగమేఘాల మీద వైద్యులను సంప్రదిస్తున్నారు. భ్రూణహత్యల నిర్మూలనకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసినా.. అవి పత్తాలేకుండానే పోతున్నాయి. ముఖ్యంగా మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పోలీసు శాఖ, రెవెన్యూ శాఖల సమన్వయంతో జిల్లా వైద్యాధికారి ఆధ్వర్యంలో తరచూ ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లను పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో ప్రత్యేక కమిటీల పర్యవేక్షణ లేకపోవడం తో ప్రైవేట్ ఆసుపత్రుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నా.. స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకున్న దాఖలాలే కనిపించడం లేదు. ఏడాదిలో ఒకటి, రెండు కేసులు కూడా నమోదు కాకపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. ప్రత్యేక కమిటీ సమావేశాలు కనిపించడం లేదు. ఏదో నామమాత్రంగానే కమిటీలను ఏర్పాటు చేస్తూ వదిలేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు పంపుతూ అధికారులు తప్పించుకుంటున్నారనే విమర్శలు లేకపోలేదు.

సంక్షిప్త సమాచారం

రేపు కొమురం సూరు వర్ధంతి సన్నాహక సమావేశం

ఉట్నూర్, అక్టోబరు 4: జోడేఘాట్ వీరుడు కొమురంభీం అనుచరుడైన కొమురం సూరు వర్ధంతి సన్నాహక సమావేశం ఆదివారం ఉట్నూర్‌లోని కోలాం సేవా సంఘం భవనంలో నిర్వహించడం జరుగుతుందని సూరు యువసేన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు టేకం వినాయక్,జిల్లా అధ్యక్షుడు కుమురం రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి టేకం భీమ్రావులు తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం యేటా జోడేఘాట్‌లో గోండువీరుడు కొమురంభీం వర్ధంతి నిర్వహిస్తున్నట్లుగానే కోలాం వీరరత్న కుంరం సూరు వర్ధంతి కూడా ఘనంగా నిర్వహించడానికి ఐటీడీఏ ద్వారా నిధులు సమకూర్చడంతో పాటు అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ మేరకు ఆదివారం మండలకేంద్రంలో నిర్వహించనున్న జిల్లా కమిటీ సమావేశానికి జిల్లాలోని అన్ని మండలాల సభ్యులు, గ్రామయూత్ కమిటీలు సకాలంలో హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో కొడప విజయ్‌కుమార్, ఆత్రం మానిక్‌రావు, టేకం తుకారాంలున్నారు.

భవన నిర్మాణానికి భూమిపూజ

ఆదిలాబాద్ అర్బన్, అక్టోబరు 4: ఈనెల 6న ఆదిలాబాద్‌లో బంజారా సేవా సంఘ భవన నిర్మాణం పనులకు భూమిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బంజారా సేవా సంఘం ఉపాధ్యక్షుడు రాథోడ్ బాబులాల్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్కతో పాటు ఎంపీ నగేష్, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అదేవిధంగా ఆ రోజు బంజారా సేవా సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల నిరసన

ఆదిలాబాద్ అర్బన్, అక్టోబరు 4: హైదరాబాద్‌లో హైడ్రా బాధితులకు న్యాయం జరగాలని పోరాటం చేస్తున్న న్యాయవాది కలీంపై పోలీసులు ప్రవర్తించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్ అన్నారు. పోలీసుల తీరును ఖండిస్తూ శుక్రవారం స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణం ఎదుట న్యాయవాదులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ ఇప్పటికైనా పోలీసులు తమ తీరును మార్చుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని ఆయన కోరారు.

'ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి కృషి'

బోథ్, అక్టోబరు 4: ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేంద్రలు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ధన్నూర్ గ్రామంలో శబరిమాత ఆశ్రమం నందు భక్తుల సౌకర్యార్థం విశ్రాంతి భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక కేంద్రాలతో మానసిక ప్రశాంతత నెలకొంటుందన్నారు. యోగులు, మునులు చూపిన మార్గంలో నడుచుకోవాలని పేర్కొన్నారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చంటి, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ అల్లూరి ప్రఫుల్ చందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ యువజన అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఇంద్రారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా
- కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం
- పలుచోట్ల డిజిటల్ కుటుంబ కార్డుల సర్వే పరిశీలన

ఆదిలాబాద్ అర్బన్, అక్టోబరు 4: నిరక్షరాస్యులైన వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం (నవభారత సాక్షరత) న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం కార్యక్రమాన్ని రూపొందించిందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిప్యూటీ డైరెక్టర్ వయోజన విద్య శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాంపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 15ఏళ్ల పైబడిన నిరక్షరాస్యులను గుర్తించి ఐదుదశల్లో వారికి శిక్షణను ఇచ్చి అక్షరాస్యులుగా తీర్చిదిద్ది ఉపాధి పొందేలా చేయడమే ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లాలో 18051 మంది లక్ష్యం కాగా, ఇందులో పురుషులు 7220, స్త్రీలు 10831 మంది ఉన్నారని, వలంటరీ లర్నర్స్ డిటైల్స్ 10రోజుల్లో ఐడెంటిఫై చేసి ఐడెంటిఫై అయిన వారికి ఒక రోజు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా బోధనాభ్యాస సామగ్రిని సిద్ధం చేస్తామని, అలాగే స్వయం సహాయక సంఘాలు, ఐకేపీ మహిళలు, ఐసీడీఎస్ లబ్ధిదారులు, మున్సిపాలిటీలో, ఉపాధి హామీ కూలీలకు ఇందులో ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం పూర్తిగా స్వచ్ఛందంగా స్థానిక వలంటీర్ల ద్వారా అమలు కానుందని, గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఇద్దరు ఉపాధ్యాయులు సహకారంతో వలంటీర్ల ద్వారా వయోజనులకు సాయంత్రం వేలలో అక్షరాస్యతను అందించనున్నారని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇందులో డీఆర్‌డీవో సాయన్న, పీడీ మెప్మ, మమత, జిల్లా వైద్యాధికారి కృష్ణ, విద్యాశాఖ సుధాకర్, మున్సిపల్ కమిషనర్ ఖమర్, తదితరులు పాల్గొన్నారు.



అడేగామ(బి)లో డిజిటల్ సర్వేలో పాల్గొన్న కలెక్టర్ రాజర్షిషా

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

ఆదిలాబాద్ రూరల్: డిజిటల్ కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. పైలెట్ ప్రాజెక్టు కింద పట్టణంలోని రాంనగర్ కాలనీలో చేపడుతున్న డిజిటల్ సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఎలాంటి తప్పులు లేకుండా సర్వే చేయాలని బృందాన్ని ఆదేశించారు. వార్డులో ప్రతీ కుటుంబాన్ని సర్వే చేయాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ ఖమర్, తహసీల్దార్ ఉన్నారు.

డిజిటల్ సర్వే సకాలంలో పూర్తి చేయాలి

ఇచ్చోడ: అర్హులైన ప్రతీ కుటుంబానికి డిజిటల్ కార్డుల పంపిణీ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్వేను సకాలంలో పూర్తిచేయాలని అధికారులు, సిబ్బందిని కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. శుక్రవారం మండలంలోని అడేగామ(బి) గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేలో పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబ డిజిటల్ కార్డు సర్వేలో అధికారులు ఎలాంటి పొరపాట్లు జరగకుంగా కుటుంబ సభ్యులు అందరి పేర్లు పక్కాగా నమోదు చేయాలన్నారు. అనంతరం సర్వే నిర్వహిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో లక్ష్మణ్, ఆర్ఐ హుస్సేన్, సిబ్బంది, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుల సంబరాలు

ఆదిలాబాద్ అర్బన్, అక్టోబరు 4: సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులకు వేతనాలు పెంచడంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించేలా సివిల్ సప్లయ్ కమిషనర్ హామీ ఇవ్వడంపై ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం చార్జీలు పెంచడాన్ని స్వాగతిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో సంబరాలు జరుపుకున్నారు. టపాసులు కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం ఏఐటీయూసీ రాష్ట్ర నాయకత్వం సమ్మె నోటీసు ఇచ్చే సమయంలో సివిల్ సప్లయ్ కమిషనర్‌తో చర్చలు జరిపారన్నారు. చర్చల్లో నాయకులు పెట్టిన డిమాండ్లను కమిషనర్ అంగికరించారన్నారు. గతంలో ఎగుమతి, దిగుమతికి రూ.20 ఇచ్చే వారని.. ప్రస్తుతం దాన్ని రూ.29కు పెంచారని, బోనస్ రూ.6500 నుంచి రూ.7500కు పెంచడంతో పాటు ఏడాదికి రెండు జతల యూనిఫాంలకు కుట్టు కూలీ గతంలో రూ.1300 ఉండగా.. ప్రస్తుతం రూ.1600 ఇచ్చేందుకు సుముఖత చూపారన్నారు. అదే విధంగా సివిల్ సప్లయ్ గోదాంలు లేని కారణంగా వ్యవసాయ మార్కెట్‌లోనే సరుకులను పెట్టేవారని, ఈ క్రమంలో వ్యవసాయ మార్కెట్, సివిల్ సప్లయ్ కార్మికులకు తరచు గొడవలు జరిగేవన్నారు. వాటిని పరిగణలోకి తీసుకొని నూతన గోదాంలకు స్థల సేకరణకు ఆదేశాలు ఇచ్చారన్నారు. అలాగే మహిళా కార్మికులకు కూడా బెన్ఫిట్స్ అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, సివిల్ సప్లయ్ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే అఫ్రోజ్, జిల్లా నాయకులు ఊశన్న, లక్ష్మిపతి, సలీం, జమ్ము, విశాల్, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.



టపాసులు కాల్చి సంబరాలు చేసుకుంటున్న హమాలీ కార్మికులు



మాట్లాడుతున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు

ఏజెన్సీ ప్రాంతంలో మతమార్పిడి ఆపాలి

- ఆదివాసీ సంక్షేమ పరిషత్ డిమాండ్

నార్నూర్, అక్టోబరు 4: ఏజెన్సీ ప్రాంతంలో బలవంతపు మతమార్పిడి ఆపాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల ప్రధాన కార్యదర్శి ఆర్కా గోవింద్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని కొమురంభీం విగ్రహం వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో 1/70 యాక్ట్ పెసా, ఇతర చట్టాలు అమలు ఉన్నా.. కొంతమంది మహారాష్ట్ర నుంచి వలస వచ్చి.. కావాలని దళిత గిరిజన ప్రజలను బలవంతపు మత మార్పిడి చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అలాగే, వలస వచ్చిన ఓ ఉద్యోగి స్థానికులను ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సమంజసమని, మండలంలో ఉపాధి హామీ పనులు ఎంతవరకు ఎక్కడ జరిగాయో చూపాలని, సహ ఉద్యోగులని ఇబ్బంది పెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. అంతేకాకుండా నార్నూర్ ఉపాధి హామీ పథకం శాఖలో ఆదివాసీ ఏపీవోను నియమించాలని, లేనిపక్షంలో నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. అలాగే, హస్నాపూర్ నుంచి ఎలాపూర్ వరకు రోడ్డు నిర్మించాలని, అలాగే తాగునీరు, విద్యం, వైద్యం సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారి వెంట ఆదివాసీ నాయకులు మేస్రం బాధిరావు కుమ్ర సెడ్మరావు, మడావి లింబారావు, మేస్రం హిరలాల్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీవో(జనరల్) జాదవ్ వసంత్‌రావు

'పకడ్బందీగా పెసా చట్టం అమలు చేస్తాం'

ఉట్నూర్, అక్టోబరు 4: ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదేశానుసారంతో ఏజెన్సీ ప్రాంతంలో పెసా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని ఏపీవో జనరల్ జాదవ్ వసంత్ రావు అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన పెసా చట్టం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెసా చట్టం ద్వారా కల్పించిన హక్కులను పటిష్టంగా గ్రామాలలో అమలు చేయుటకు పెసా మొబైలర్స్ ఐటీడీఏకు, ప్రజలకు మధ్య వారధిగా ఉండాలన్నారు. గ్రామాల అబివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. విద్య, వైద్య, గ్రామాల అభివృద్ధికి గిరిజనులు అధికారులకు సహకరించాలన్నారు. గ్రామస్థాయిలో అభివృద్ధి పనులను పెసా గ్రామసభ తీర్మానం చేసే విధంగా మొబైలర్స్ కృషి చేయాలన్నారు. ఆ తర్వాత ప్రిన్సిపాల్ డా.మనోహర్ మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతీ, సంప్రదాయాలు, ఆచారాలు, కట్టుబాట్లను పెసా చట్టం ద్వారా పరిరక్షణ చేయవచ్చు అన్నారు. ఈ శిక్షణ శిబిరంలో ఉమ్మడి జిల్లా పెసా కోఆర్డినేటర్ ఆర్కవసంత్‌రావు పెసా చట్టం నియమాలను గురించి పవర్ ప్రజంటేషన్‌తో వివరించారు. ఇందులో జిల్లాలోని పెసా చట్టం మొబైలైజర్స్, తదితరులు పాల్గొన్నారు.

7న ఐటీడీఏ ఎదుట ధర్నా : తుడుందెబ్బ

ఇంద్రవెల్లి, అక్టోబరు 4: ఏజెన్సీలోని భూ సమస్యల సాధన కోసం ఈ నెల 7న ఐటీడీఏ ముందు చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు పూర్క చిత్రు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ భూ సమస్యలు ఐటీఈఏ అధికారుల నుంచి కలెక్టర్‌కి అప్పగించిన హైకోర్టు తీర్మానాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. ఐటీడీఏ ఉన్నది ఆదివాసీల కోసమని, మా సమస్యలు ఐటీడీఏలోనే పరిష్కరించాలన్నారు. భూ సమస్యలపై ఐటీడీఏ పీవోకే అన్ని హక్కులు ఉండేలా చూడాలన్నారు. భూ సమస్యలను తిరిగి ఐటీడీఏ పీవోకే అని అధికారులు ఇవ్వాలని డిమాండ్‌తో తుడుందెబ్బ గోండ్వాన రాయి సెంటర్, ఆదివాసీ తెగల సంఘ నాయకుల ఆధ్వర్యంలో ఈనెల 7న చేపట్టే ఐటీడీఏ ముందు ధర్నా కార్యక్రమానికి ఆదివాసీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ నాయకులు జుగ్నాక్ భారత్, కొట్నాక్ భారిక్ రావు, మెస్రం జైరామ్, తదితరులు పాల్గొన్నారు.